## 49వ అఖిల భారత నృత్య సంగీత పోటీలు

చిక్కడపల్లి, జూలై 3: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో 49వ అఖిల భారత నృత్య సంగీత పోటీలను సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తెలిపారు. బుధవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా లెక్కల ఉప సంచాలకులు జి.వసుంధర ఆవిష్కరించారు. వివరాల కోసం 90086 25949, 89197 92216లో సంప్రదించాలని సమితి సమన్వయకర్త నిష్టల సుధామాల సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందూరి విద్యారణ్య స్వామి, రజిత్ ఆకుల, నవ్యనాటక సమితి సభ్యులు పాల్గొన్నారు.

### టీజీ సీపీజీఈటీ 2024లో
## ఎంఈడీ పరీక్షా తేదీ మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 3: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పరిధిలో అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ సీపీజీఈటీ– 2024లో భాగమైన ఎంఈడీ పరీక్షా తేదీని మార్చినట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 7న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండున్నర గంటల వరకు నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించినప్పటికీ.. దానిని వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ పరీక్షను తిరిగి ఈ నెల 16న ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదకొండు గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

## ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

ఖైరతాబాద్, జూలై 3 : కాంగ్రెస్ ప్రభుత్వం అభయ హస్తంలో పేర్కొన్న జీవో నం.15ను పునరుద్ధరణ చేసి ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కో ఆపరేటివ్ సొసైటీకి సంవత్సరానికి రూ.1,000 కోట్లు మంజూరు చేయాలన్నారు. అలాగే, మత్స్య అభివృద్ధి కోసం తెలంగాణ మత్స్య కోఆపరేటివ్ ఫెడరేషన్‌కు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, నూతన పాలక మండలిని ఏర్పాటు చేసి చైర్మన్‌గా ముదిరాజ్‌లకే అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ కుమార్, యువజన అధ్యక్షులు బాలు, మహిళా నాయకురాలు ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం నేత గరిగె ఉపేందర్‌రావు

## వీఆర్‌వోలను రెవెన్యూ శాఖలో చేర్చాలి

ముషీరాబాద్, జూలై 3: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వీఆర్‌వోలను రెవెన్యూ శాఖలో తిరిగి చేర్చి ఇంక్రిమెంట్ ఇవ్వాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం నేత గరిగె ఉపేందర్ రావు డిమాండ్ చేశారు. బుధవారం రాంనగర్ ఎస్ఆర్‌టీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వీఆర్‌వోల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపేందర్‌రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన 121 జీవోను రద్దు చేసి వీఆర్‌వోలను రెవెన్యూ శాఖలో చేర్చి, ఆదుకోవాలని కోరారు. వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేసి.. ఉద్యోగులకు వివిధ శాఖల్లో పోస్టింగ్‌లు ఇచ్చారని, దీంతో వారి జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యూటీలో చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని, వీఆర్‌ఓలకు 010 జీవో ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోల సంక్షేమ సంఘం ప్రతినిధులు కృష్ణ, కె.ప్రసాద్‌బాబు, గోవర్ధనాచారి, కృష్ణమూర్తి, విజయనాథ్, ప్రకాశ్‌రావు, వీరస్వామి, వెంకటేశ్, కృష్ణమ్మ, రాఘవేందర్, వెంకటేశ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## మానవ సంబంధాలు పెంపొందించుకోవాలి

హిమాయత్‌నగర్, జూలై 3: మానవ సంబంధాలను మరింత పెంపొందించుకునేందుకు సైకాలజిస్టు సేవలు ఎంతో అవసరమని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మానవ సంబంధాలు, వారి వ్యక్తిత్వ విశ్లేషణ, సంఘం సభ్యుల నైపుణ్యం.. పెంపుదల అనే అంశంపై ఈ నెల 21న బషీర్‌బాగ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మానవుల సంబంధాల పెంపుదలకు ఈ శిక్షణ ఒక చక్కని సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణకు విద్యార్థులు, ఉద్యోగులతో పాటు విభిన్న రంగాల్లో పనిచేస్తున్న వారు హాజరై స్వీయ అవగాహన పెంచుకోవాలన్నారు.

## రేపు జాబ్ మేళా

అమీర్‌పేట్, జూలై 3 : రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ఎన్‌సీఎస్(నేషనల్ కెరీర్ సర్వీస్) డాన్‌బాస్కో దిశ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారు. సనత్‌నగర్‌లోని సెయింట్ థెరిస్సా చర్చి ఆవరణలోని డాన్‌బాస్కో దిశ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ జాబ్ మేళా కొనసాగనున్నది. ఈ మేరకు దిశ డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కో ఆర్డినేటర్లు ఐవనో వాజ్, కార్తిక్, జిల్లా ఎన్‌వీఎస్ అధికారి విజయ్‌కుమార్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులను నేరుగా ఇంటర్వ్యూలు చేసి.. ఎంపిక చేస్తామని, మరిన్ని వివరాల కోసం 9494092218, 8977175394 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## నేడు ఎస్‌ఎఫ్‌ఐ బంద్..

జూబ్లీహిల్స్, జూలై 3: మెడికల్ విద్యార్థుల ప్రవేశ పరీక్షలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ.. జాతీయ పరీక్షల సమగ్రతను కాపాడాలని, కేంద్ర, రాష్ట్ర విద్యా సంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ (స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడి ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

### అఫ్జల్‌గంజ్ పోలీసులకు..
## ప్రభుత్వ దంత కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు

సుల్తాన్‌బజార్, జూలై 3: తోటి సిబ్బంది విధుల్లో తనకు సహకరించకపోవడంతో పాటు తప్పుడు ప్రచారంతో తనను బెదిరింపులకు గురిచేస్తున్నారంటూ ప్రభుత్వ దంత కళాశాల ప్రిన్సిపాల్ డా.అరుణ బుధవారం అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉస్మానియా డెంటల్ కళాశాల అసోసియేషన్, ప్రభుత్వ వైద్యుల సంఘం యూనిట్ –1 నాయకులతో పాటు దవాఖాన టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్ తన మాట వినడం లేదని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించకపోవడమే కాకుండా దురుసు మాటలతో తనను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అఫ్జల్‌గంజ్ పోలీసులను వివరణ కోరగా.. ఫిర్యాదు విషయం ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని, ఎలాంటి ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదని స్పష్టం చేశారు.

# చెరువుల్లో చేపపిల్లలను వదులుతారా?



### ఇప్పటికీ సిద్ధం కాని ప్రణాళిక
### టెండర్లు ఖరారు చేయకపోవడంతో నెలకొన్న సందిగ్ధత

మేడ్చల్, జూలై 3 (నమస్తే తెలంగాణ): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి వంద శాతం రాయితీపై చేప పిల్లలను చెరువుల్లో వదిలే ప్రక్రియపై సందిగ్ధం నెలకొన్నది. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులలో చేపపిల్లల వదిలివేత కార్యక్రమంపై ఎలాంటి ప్రణాళికను సిద్ధం చేయకపోవడంతో మత్స్యకారుల్లో సందిగ్ధం నెలకొన్నది. అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకే చేప పిల్లలను వదిలే కార్యక్రమంపై ప్రణాళికను సిద్ధం చేసి.. టెండర్లను ఖరారు చేసేవారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం మారిన క్రమంలో నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు చేప పిల్లల వదిలివేతపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 232 చెరువులలో వంద శాతం సబ్సిడీపై గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 69 లక్షల చేపపిల్లలను చెరువుల్లో వదిలిన విషయం తెలిసిందే. జిల్లాలోని మత్స్యశాఖ ఆధీనంలో ఉన్న చెరువుల్లో చేపపిల్లలను వేసి స్థానిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు కౌలుపై ఇచ్చే ఆనవాయితీ కొనసాగుతూ వస్తున్నది.

### నూతన మార్గదర్శకాల తర్వాతే టెండర్లు..?

చేప పిల్లల వదిలివేత ప్రక్రియకు సంబంధించి నూతన మార్గదర్శకాల తర్వాతే టెండర్లు ఖరారుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశమున్నదని తెలుస్తున్నది. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం మార్గదర్శకాలపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నట్లు అధికారులకు సమాచారం లేదు. చేపపిల్లల వదిలివేతకు టెండర్లు ఇప్పటికే పూర్తయితే టెండర్లు పొందిన కాంట్రాక్టర్ చెరువులు 50 నుంచి 60 శాతం నిండిన వెంటనే చేపపిల్లను వేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇప్పటి వరకు టెండర్ ప్రక్రియ పూర్తి కాని నేపథ్యంలో ఈ ఏడు చేప పిల్లలను చెరువుల్లో వదులుతారా? లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలో (68 చెరువులు), మేడ్చల్(77), కీసర (25), ఘట్‌కేసర్(18), కుత్బుల్లాపూర్(4), దుండిగల్ (24), బాచుపల్లి(5), అల్వాల్(2), కాప్రా (7), మేడిపల్లి (2) చెరువులున్నాయి. మత్స్యకారులు ఆర్థికాభివృద్ధికి ఎంతో ఉపయోగపడిన వంద శాతం రాయితీపై చేప పిల్లల వదిలివేత కార్యక్రమంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మత్స్యకార సభ్యుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

# అమలుకాని హామీ.. జమకాని గ్యాస్ సబ్సిడీ

### మహాలక్ష్మి లబ్ధిదారుల ఆందోళన
### బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు



కందుకూరు, జూలై 3: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారందరికీ రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ఇచ్చిన హామీ అమలు కావడంలేదు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రాయితీపై సిలిండర్ అందజేయాలని గ్యాస్ ఏజెన్సీలకు సైతం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అర్హులైన వారు ఏజెన్సీల నుంచి సిలిండర్లు పొందుతున్నారు. అయితే, చాలా మంది గ్యాస్ వినియోగదారులు తమ బ్యాంకు ఖాతాల్లో మహాలక్ష్మి పథకం రాయితీ జమ కావడంలేదని వాపోతున్నారు. లబ్ధిదారులు ప్రతిరోజూ గ్యాస్ ఏజెన్సీలు, గ్రామ పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు జమ కాకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

### ప్రభుత్వ విఫలం



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైంది. లబ్ధిదారులు ప్రతి రోజూ గ్యాస్ ఏజెన్సీలు, మండల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. 6 గ్యారంటీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎన్నికల జరిగి ఏడు నెలలు కావస్తున్నా.. పథకాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి. లేని పక్షంలో ప్రభుత్వంపై పోరాడుతాం.

**- సురుసాని రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు, కందుకూరు**

### సిలిండర్‌పై రాయితీ చెల్లించాలి..



రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకే హామీ ఇచ్చినట్లు ఉన్నది. ఏడు నెలలు గడుస్తున్నా.. హామీ నెరవేరడం లేదు. రూ.500 రాయితీ వస్తదని లబ్ధిదారులు ఆశ పడుతున్నారు. రాయితీ డబ్బులు ఖాతాల్లో జమ కావడంలేదు. వారి ఆశలను వమ్ము చేస్తున్నారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి.

**- కాకి ఇందిరమ్మ దశరథ ముదిరాజ్, మాజీ సర్పంచ్, అన్నోజిగూడ**

### సబ్సిడీ రావడం లేదు..



గ్రామాల్లో ఎవరికీ మహాలక్ష్మి పథకం కింద రూ.500 సబ్సిడీ రావడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణలో అమలు కానీ హామీలను ఇచ్చారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బ్యాంకు ఖాతాల్లో రాయితీ డబ్బులు జమ కాకపోవడంతో అబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలి.

**- తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, ఎంపీపీసీ, బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కందుకూరు**


# కబ్జా రాయుళ్ల దే రాజ్యం.!

### బాలాపూర్ భూముల కబ్జాపై
### సర్వే సాకుతో తాత్సారం
### కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నదని గ్రామస్తుల ఆరోపణ



**రంగారెడ్డి** జిల్లా బాలాపూర్‌లోని సర్వేనంబర్ 74లో వ్యవసాయం చేసుకుంటున్న దళిత రైతుల నుంచి భూమిని (గైరాన్ సర్కారి) సేకరించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ భూమిని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఏఆర్‌సీఐకి అప్పగించింది. అందుకు గాను దళిత రైతులకు 60 చదరపు గజాల చొప్పున స్థలాలు ఇస్తూ.. పట్టాలు జారీ చేసింది. 1993లో జారీ చేసిన ఈ పట్టాలకు సంబంధించి ఇప్పటి వరకు అధికారులు స్థలాలను అప్పగించలేదు. ఇదేమంటే.. అందుకు సంబంధించిన ఫైళ్లు కనిపించడం లేదంటున్నారు. సాగు చేసే భూమిని కోల్పోయి.. ఇటు ఇంటి స్థలాలూ రాక కేవలం పట్టాలను చూసుకొని మురవాల్సిన దుస్థితి.

**బాలాపూర్** సర్వేనంబర్ 74లోని ప్రభుత్వ భూమిలో సాగుతున్న కబ్జాపర్వమిది. బహిరంగంగానే సర్కారు భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తుంటే బాలాపూర్ గ్రామస్తులు తాసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రోజులు గడుస్తున్నా అధికారులు స్పందించిందీ లేదు.. అక్రమ నిర్మాణాన్ని ఆపిందీ లేదు. ఇదేమంటే... సర్వే చేస్తాం.! ఆ తర్వాత ఆక్రమణలు తొలగిస్తామంటున్నారు. అక్రమ నిర్మాణాలు జరిగేదాకా ఆగేది ఎందుకు? ఆ తర్వాత కూల్చి వేతల హైడ్రామా నడిపేదెందుకు? అనేది గ్రామస్తుల ఆరోపణ. ముఖ్యంగా పేదలకు పట్టాలిచ్చిన భూమిలో.. ఇది ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు.. కబ్జా అవుతున్న భూమిలో మాత్రం బోర్డులు ఏర్పాటు చేసేందుకు సర్వేల సాకు చూపుతున్నారు.



**ఇదీ... బాలాపూర్‌లోని** 74 సర్వేనంబర్ కథా కమామీషు. కోట్ల రూపాయల విలువజేసే ప్రభుత్వ భూమి కండ్ల ముందు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంపై బాలాపూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర సర్వే ద్వారా పదెకరాల వరకు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే అవకాశం ఉన్నా.. అధికారులు తాత్సారం చేయడం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నదని వారు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో ఎందుకు నిర్మాణాలు చేస్తున్నారని తాము అడిగితే... గ్రామంలో ఉన్న పెద్ద మనుషులను కలవాల్సిందిగా సదరు నిర్మాణం చేపట్టిన వ్యక్తులు చెబుతున్నారని.. అందుకే కాంగ్రెస్ పెద్ద మనుషులే దీని వెనుక సూత్రధారులని తమకు అర్థమైందని అంటున్నారు. కాగా, ఈ భూమి అన్యాక్రాంతంపై బాలాపూర్ తాసీల్దార్ మాధవీరెడ్డి బుధవారం కూడా పాత సాకునే చూపారు. సర్వే రిపోర్టు రాగానే కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదే సర్వే నంబర్‌లో ఎక్కడైనా కబ్జాలు అవుతున్నట్లు తెలిస్తే సమగ్ర సర్వే చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణం చేపడుతున్న వారు పక్క సర్వే నంబర్ వారు అయినందున కొంత సమయం ఇస్తున్నామని, సర్వేలో వచ్చిన రిపోర్టు ఆధారంగా నిర్మాణాలు ఉన్నట్లయితే తొలగించి, ఆ భూమిని స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు.

**- బడంగ్‌పేట్, జూలై 3**

## గురుకులాల్లో గుడ్లు, చికెన్, మటన్

### సరఫరాకు దరఖాస్తులు ఆహ్వానం
### రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్యవర్మ

సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలలకు గుడ్లు, చికెన్, మటన్ సరఫరా కొరకు సరఫరాదారుల నుంచి సీల్డ్ టెండర్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్య వర్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను మన్సూరాబాద్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నుంచి తీసుకొని ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అక్కడే సమర్పించాలని సూచించారు. ఈ నెల 6న కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సీల్డ్ కవర్ తెరిచి అర్హులైన సరఫరాదారులను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

## విభిన్న కవితా రచనలు ఇనాక్ సొంతం



సప్తాహంలో మాట్లాడుతున్న సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి

ముషీరాబాద్, జూలై 3: విభిన్నమైన కవితా రచనలతో అట్టడుగు వర్గాల బాధలు, శ్రమను ప్రస్ఫుటం చేసిన గొప్ప రచయిత ఆచార్య కొలకలూరి ఇనాక్ అని సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరుగుతున్న సాహితీ సమాలోచన సప్తాహంలో భాగంగా మూడో రోజు బుధవారం పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ కవిత్వంపై ప్రసంగ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, చిలుకూరు రంగరాజన్, టి. చంద్రశేఖర్, ఆచార్య సూర్య ధనుంజయ, సుష్మ తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి

## బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి

### రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి..

జూబ్లీహిల్స్, జూలై 3: బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి పేర్కొన్నారు. బుధవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో 'ఆపరేషన్ ముస్కాన్' పదో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 'ఆపరేషన్ ముస్కాన్–10' డ్రైవ్ ద్వారా నిరాశ్రయులైన పిల్లలను, భిక్షాటనలో చిక్కుకున్న పిల్లలను, బాల కార్మికులను రక్షించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. జూలై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టి, వెట్టిచాకిరీ కూపంలో మగ్గిపోతున్న పిల్లలను రక్షించిన వారికి విద్య, పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆపరేషన్‌లో 'దర్పన్' అనే ఫేషియల్ రికగ్నేషన్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ ద్వారా వివిధ కారణాలతో కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లలను, తప్పిపోయిన పిల్లలను గుర్తించనున్నట్లు తెలిపారు. ఒడిశా, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన ఇటుక బట్టీ కార్మికుల పిల్లలు విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో వారి నివాస ప్రాంతాల్లోనే వర్క్ సైట్ పాఠశాలలు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్, ఏసీపీ వెంకటేశం, రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి పద్మజా రమణి, మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, రంగారెడ్డి–మేడ్చల్, యాదాద్రి జిల్లాల సీడబ్ల్యూసీ చైర్‌పర్సనులు నరేందర్ రెడ్డి, రాజారెడ్డి, జయశ్రీ, మేడ్చల్ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ రఘునాథస్వామి, మేడ్చల్, యాదాద్రి జిల్లాల డీసీపీఓలు ఇంతియాజ్, సైదులు, బాలరక్ష భవన్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, బచ్‌పన్ బచావో ఆందోళన్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, చైల్డ్ లైన్ అధికారులు, రాచకొండ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శాలివాహననగర్ బస్తీలో దండోరా రజతోత్సవాలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న పొలిట్ బ్యూరో సభ్యుడు బట్టు దాసురావు మాదిగ, రాష్ట్ర నాయకులు ఇమ్మడి నాగయ్య, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బట్టు రామకృష్ణ తదితరులు

## 7న రవీంద్రభారతిలో దండోరా రజతోత్సవాలు

### పొలిట్ బ్యూరో సభ్యుడు బట్టు దాసురావు మాదిగ

మలక్‌పేట, జూలై 3: మాదిగ హక్కుల సాధన కోసం ప్రారంభమైన దండోరా ఉద్యమం 30 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూలై 7న రవీంద్రభారతిలో నిర్వహించనున్న దండోరా రజతోత్సవాలకు విద్యావంతులు, మేధావులు, మాదిగలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పొలిట్ బ్యూరో సభ్యుడు బట్టు దాసురావు మాదిగ కోరారు. బుధవారం శాలివాహననగర్ బస్తీలో దండోరా రజతోత్సవాలకు సంబంధించిన గోడ పత్రికను ఆయన దండోరా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ దండోరా రజతోత్సవాలకు రాష్ట్రంలోని ప్రతి మండలం నుంచి పది మంది చొప్పున హాజరై మాదిగల ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బట్టు రామకృష్ణ, రాష్ట్ర నాయకులు ఇమ్మడి నాగయ్య, జిల్లా నాయకులు అనపర్తి సోమయ్య, సీహెచ్. వెంకన్న, బొల్లు కృష్ణ, ఎం.నగేశ్, సీహెచ్.రాజు, మహిళా నాయకురాళ్లు ఆర్.నాగమణి, బొజ్జ వీరమణి, ఎం.రేణుక, ఎ.సంతోషమ్మ, మాచర్ల దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వర్క్‌షాప్ ఎక్స్‌పో ప్రయోగ నమూనాల ప్రదర్శనను తిలకిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఎం.కుమార్, యూనివర్సిటీ సైన్స్ కాళాశాల డీన్ డి.కరుణాసాగర్

## విద్యార్థులు శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను సాధించాలి

### ఎం.కుమార్, డీన్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల

అబిడ్స్, జూలై 3: విద్యార్థులు శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను సాధించాలని ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఎం.కుమార్ పేర్కొన్నారు. చాపెల్ రోడ్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ ఎక్స్‌పో పేరిట ప్రయోగ నమూనాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం.కుమార్ మాట్లాడుతూ.. అనేక రకాల వస్తు సేవలను ఉత్పత్తి చేయాలన్నారు. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్.. తదితర రంగాలు ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఆసక్తి కలిగి అనేక రకాల సైన్స్ పుస్తకాలు చదవాలని, అంతే కాకుండా.. రీసెర్చ్ ఆర్టికల్స్ అధ్యయనం చేయాలని కోరారు. విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానం సమాజానికి ఉపయోగపడాలని కోరారు. డాక్టర్ కె.రాజేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థినులు నీటి కాలుష్య నివారణ, ఆటోమేటిక్ సెన్సార్ జనరేటర్స్, డయోడ్స్, ధ్వని తరంగాలు, తరంగాలు తదితర అంశాలపై పరికరాలు రూపొందించి ప్రదర్శించారు. అనంతరం విభాగ అధిపతి డాక్టర్ వి.అనురాధ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థినులు ప్రయోగాల పట్ల ఆసక్తి చూపడం సంతోషదాయకమన్నారు. సమాజానికి ఉపయోగపడే అంశాలను గుర్తించి పరికరాలను రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కె.కృష్ణారావు, డైరెక్టర్లు రాకేశ్ రెడ్డి, ఎ.వినయ్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక, డాక్టర్ ఎ.కనకదుర్గా, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎ.రమేశ్ తదితరులు పాల్గొని విద్యార్థులు చేసిన నమూనాలను పరిశీలించి వారికి అభినందనలు తెలిపారు.



వర్క్‌షాప్ ఎక్స్‌పోలో పాల్గొన్న స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు